ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శనివారం, 7 సెప్టెంబరు 2024



జై జై గణేశా..

- నేడు వినాయక చవితి పర్వదినం
- నవరాత్రులకు మండపాలు సిద్ధం
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిక్కిరిసిన వీధులు

6





కాళ్లు మొక్కబోయిన రైతును నిలువరిస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్



కూసుమంచి మండలం నానుతండాలో ఇసుకమేటలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి చౌహాన్

రైతులు కంటతడి

పెట్టుకోవద్దు

నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటాం

- వర్షాలు, వరదల వల్ల పంటలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి
- కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా చర్యలు చేపడతాయి
- కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ భరోసా
- మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో ఏరియల్ సర్వే
- జరిగిన నష్టాన్ని వివరించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఉద్వేగంగా సాగిన 'రైతులతో ముఖాముఖి'
- కాళ్లపై పడబోయిన రైతును వారించి అనునయించిన కేంద్ర మంత్రి చౌహాన్

ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కూసుమంచి, సెప్టెంబరు 6: భారీ వర్షాలు, వరదల వల్ల భారీ నష్టాన్ని చవిచూసిన ఖమ్మం జిల్లాకు అండగా ఉంటామని, నష్టపోయిన వారిని ఆదుకుంటామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌లు పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుతో నష్టపోయిన రైతులు, వరద బాధితులు ఆందోళన చెందవద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

ఖమ్మం జిల్లాలో వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం హెలీకాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలో వారి సర్వే కొనసాగింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నష్టం జరిగిన తీరును కేంద్ర మంత్రులకు స్వయంగా చూపించారు.

అనంతరం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం సూర్యాపేట జాతీయ రహదారి పక్కనే నాయకన్ గూడెం వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద దిగిన కేంద్ర మంత్రి చౌహాన్‌తోపాటు హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎగ్జిబిషన్ తిలకించి రైతులనుద్దేశించి ప్రసంగించారు. వరద ఉధృతంగా రావడంతో పంటలే కాక పశువులు, ఇళ్లు, సామాన్లు కోల్పోవడం బాధాకరమని, రైతుల పరిస్థితి, జరిగినపంటల నష్టం తెలుసుకోవడానికి ప్రధాని మోదీ స్వయంగా తనను పంపించారని తెలిపారు. నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రధాని మోదీకి జరిగిన నష్టాన్ని పూర్తిగా వివరించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో జరిగిన వరద నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్రమంత్రులు

జరిగిన నష్టాన్ని తెలంగాణ ప్రభుత్వం పూర్తి నివేదిక ద్వారా అందించాలని కోరారు. వందేళ్లలో ఎన్నడూ రాని వరద ఈ ప్రాంతంలో వచ్చిందని, చెబుతున్నారని, కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా వరద నష్టం నివారణకు కృషిచేయడం జరుగుతుందని తెలిపారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఈ వరదల్లో పెద్దనష్టం జరిగిందని, జరిగిన నష్టానికి అవసరమైన సహాయం కేంద్రం నుంచి చేయడం జరుగుతుందని వివరించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గతంలో ఎన్నడూలేని విధంగా అకాలవర్షాల కారణంగా పెద్దఎత్తున నష్టపోయాయని, సర్వం రైతుల కోల్పోయారని, కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగురాష్ట్రాలను ఇతోధికంగా అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంటలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మూడున్నర నుంచి 4లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, పత్తి, మిర్చి, వరి పంటలు నష్టపోయారని, ఇసుకమేటలు వేశాయని, అందరు రైతులతో పాటు గ్రామాలు, ఇళ్లు సర్వం కోల్పోయారని, కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 60వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు.

కన్నీటి పర్యంతమైన రైతులు

భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని పాలేరు రైతులు... కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను వేడుకున్నారు. కూసుమంచి మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. కోక్యాతండకు చెందిన హలావత్ నర్సింహారావు అనే రైతు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ (మిగతా 6వ పేజీలో)

వరి పొలాలను, రహదారులను పరిశీలిస్తూ...

కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ కూసుమంచి మండలం నానుతండా వద్ద పాలేరు వరద కారణంగా ఇసుకమేట వేసిన పొలాలను, దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా రైతులతో జరిగిన పంటనష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. తాము సాగుచేసిన పంటలన్నీ నీటమునిగాయంటూ మంత్రుల దృష్టికీ తీసుకవచ్చి కన్నీటిపర్యంతమయ్యారు. సాయం అందించి ఆదుకుంటామని మంత్రి చౌహాన్ రైతులకు హామీ ఇచ్చారు. అలాగే భారీ వరదల కారణంగా ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి ఒకవైపు కూలిపోగా కేంద్రమంత్రులు పరిశీలించారు. నాయకన్‌గూడెం వద్ద హెలీకాప్టర్‌లో వచ్చిన మంత్రులు రోడ్డు మార్గాన వస్తూ ఖమ్మం-సూర్యాపేట దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడినుంచి పాలేరు జలాశయం వరదను తిలకించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రులకు వివరించారు.

వర్షంతో కూలిన టెంట్లు...

కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండిసంజయ్‌లు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన నేపథ్యంలో పాలేరు వద్ద మధ్యాహ్నం కురిసిన వర్షం మంత్రుల పర్యటనకు తీవ్ర ఆటంకం కలిగించింది. జిల్లాలో వర్షాలు, మున్నేరు వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్‌చౌహాన్, బండిసంజయ్‌లు వస్తున్న నేపథ్యంలో పాలేరు రిజర్వాయర్‌పక్కన రైతులతో ముఖాముఖితో పాటు సమావేశం, ఫొటో ఎగ్జిబిషన్ వేదిక ఏర్పాటుచేశారు. మంత్రులు కొద్ది సమయంలో వస్తారనగానే ఆకస్మికంగా మబ్బులు వేసి భారీవర్షం కురవడంతో టెంట్లు పడిపోయాయి. ఫొటో ఎగ్జిబిషన్ బోర్డులు పడిపోవడతో అధికారులు వెంటనే పక్కనే ఉన్న నవోదయ పాఠశాలలోకి వేదికను మార్చు చేశారు.



ఘనస్వాగతం పలికిన నేతలు

ఖమ్మంజిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర మంత్రులు ఘనస్వాగతం పలికారు. హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 12:30 గంటలకు నాయకన్‌గూడెం వద్దగల టోల్ ప్లాజా వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద మంత్రులు ల్యాండ్ అయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర మంత్రుల వెంట రాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్వాగతం పలికారు. కేంద్రమంత్రులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను నవోదయలో ఏర్పాటుచేయగా మంత్రులు తిలకించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పలువురు జిల్లా కాంగ్రెస్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మున్నేరు వరద తగ్గినా.. ఇంకా కన్నీటిలోనే బాధితులు జీవిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆపన్నహస్తాలు అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. వరద బాధితులకు అండగా జిల్లాలో ప్రభుత్వంతోపాటు అనేక ప్రైవేటు స్వచ్ఛంధ సంస్థలు ప్రజాప్రతినిధులు, పార్టీల నేతలు నిత్యావసర వస్తువులు, ఇతర సహాయ కార్యక్రమాలు సాగిస్తున్నాయి. ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వరదకు దెబ్బతిన్న గ్రామాలు, పట్టణాల్లో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటు రైతుల పంటపొలాలు, దెబ్బతిన్న ఇళ్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీతోపాటు నగదు పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఇప్పటికే బ్యాంకు అకౌంట్లు తీసుకుని కుటుంబానికి రూ.10వేలు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

కన్నీటి బతుకులు

ఆపన్నహస్తాల కోసం మున్నేరు వరద బాధితుల ఎదురుచూపులు

- అటు ప్రభుత్వం.. ఇటు స్వచ్ఛంద సంస్థల సహాయం
- 19 డివిజన్లలో 8,902 నివాసాల్లో పూర్తయిన సర్వే
- 90శాతం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- వరద తాకిడి ప్రాంతాల్లో విస్తృతంగా పారిశుధ్య చర్యలు
- కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరాలు
- పర్యవేక్షిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి



సర్వే దృశ్యం



ఇంకా బురదమయంగానే...

ఖమ్మం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో వైద్యారోగ్యశాఖ వైద్యబృందాలను ఏర్పాటుచేసి ఇంటింటికి వైద్యచికిత్సలు అందిస్తుండగా విద్యుత్‌శాఖ 90 శాతం విద్యుత్ పునరుద్దరణ పనులు పూర్తి చేసింది. రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్యశాఖ, ఆర్అండ్‌బీ, పీఆర్, వ్యవసాయం మునిసిపల్, పబ్లిక్‌హెల్త్, తదితర శాఖలు వరద సహాయక కార్యక్రమాల్లోన్లూ నిమగ్నమయ్యాయి. అటు పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాయి. ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం, మధిరరూరల్, చింతకాని, బోనకల్ మండలాల్లో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరద బాధితులు ఇళ్లకు చేరి తిరిగి జీవనాన్ని కొనసాగిస్తుండగా.. మున్నేరుకు ఆనుకుని ఉన్న ఇళ్లు, కాలనీల్లో మాత్రం ఇంకా తేరుకోలేని పరిస్థితి ఉంది.



సాయం చేస్తున్న వీవీసీ ట్రస్ట్

ఇప్పటివరకు నష్టం

ఖమ్మం జిల్లాలో వరద నష్టంపై ఇంకా సర్వేలు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 658 గుడిసెలు మున్నేరు వరదతోపాటు వర్షాలకు కొట్టుకుపోగా 440ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 1,269 ఇళ్లకు పాక్షికంగా నష్టం జరిగింది. 52,153 కోళ్లు వర్షాలకు, వరదలకు మృతిచెందగా 495 పశువులు చనిపోయాయి. కాగా జిల్లాలో 53,528 మంది రైతులకు సంబంధించి 65 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. 180 చెరువులలో మత్స్య సంపద కొట్టుకుపోగా 99 ఇరిగేషన్ శాఖ చెరువులు దెబ్బతిన్నాయి. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 40రోడ్లు పూర్తిగా దెబ్బతినగా, ప్రభుత్వ పాఠశాలల కాంపౌండ్స్ వాల్స్ 66 పడిపోయాయి.

తొలి విడత సర్వే పూర్తి

ఖమ్మం సంక్షేమ విభాగం: మున్నేరు పరివాహక ప్రాంతంలో నీళ్లలో మునిగిపోయిన బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణలో తొలి విడత సర్వే 600నివాసాలు మినహా పూర్తి అయినట్టు తెలుస్తోంది. గత మూడు రోజులుగా ఖమ్మం నగరంలో వరద ప్రభావిత 19 డివిజన్లలో రెవెన్యూ శాఖ, ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ఇంటింటి సర్వే చేపట్టారు. మున్నేరు పరివాహక ప్రాంతంతోపాటుగా వరద పోటుకు గురైన డివిజన్లలో తొలి విడతగా సర్వే నిర్వహించారు.

కాగా శుక్రవారం వరకు 19డివిజన్లలో 8,902 నివాసాలకు వెళ్లి ఇంటింటి సర్వే జరిపారు. వీటిలో 7,946 నివాసాలను కంప్యూటరీకరణ జరిగింది. మరో 900నివాసాల వరకు కంప్యూటరీకరణ జరగాల్సి ఉంది. బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్‌తోపాటుగా మరికొన్ని ప్రాంతాల్లో మరో 600 నివాసాలకు వరకు తొలి విడతలో సర్వే జరపాల్సి ఉంది.



మాజీమంత్రి హరీష్‌రావు వితరణ

- మున్నేరు వరద బాధితులకు నిత్యావసరాలు
- అందజేసిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- 2500 కిట్ల పంపిణీ

6

ఉధృత గోదావరిని

దాటలేక..

- తెలంగాణ భూభాగంలో నిలిచిపోయిన మావోయిస్టులు..
- ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీసులు, కూంబింగ్‌తో మూల్యం
- 2 నెలలుగా ములుగు, భద్రాద్రి ఏజెన్సీలో లచ్చన్న దళం
- ఈ క్రమంలోనే దోనాలకుంట ఎన్‌కౌంటర్ ఘటన..

6

మణుగూరులో ఉద్రిక్తత

- మావోయిస్టుల మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత
- ఏరియా ఆస్పత్రి వద్ద పోలీసుల ఆంక్షలు

చట్టవ్యతిరేకులను ఉపేక్షించం

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

6

ఆర్నెల్ల పాటు ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై

రాకపోకలు బంద్

అడ్డంగా గోడ నిర్మాణం... కూల్చేందుకు యత్నించిన ఇద్దరు మహిళలపై కేసు



ఖమ్మం క్రైం/ఖమ్మంరూరల్, సెప్టెంబరు 6: మున్నేరు వరద బీభత్సం నేపథ్యంలో ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారడంతో వాహనాల రాకపోకలను ఆరునెలల పాటు నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. బ్రిడ్జిపైన ఆరు స్లాబులు పక్కకు జరగడంతో ఆర్అండ్‌బీ అధికారులు ప్రత్యేక నిపుణుల బృందంతో పరిశీలించి మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాహనాల రాకపోకలను నిలువరించేందుకు బ్రిడ్జికి ఇరువైపులా అడ్డంగా శుక్రవారం గోడ నిర్మించారు. అయితే గోడ నిర్మిస్తే తాము ఎలా ఖమ్మం పట్టణంలోని వెళ్లాలి అంటూ వెంకటగిరి పరిధిలోని కోటనారాయణపురం గ్రామానికి చెందిన స్వప్న, అఫ్జలబీ అనే ఇద్దరు మహిళలు గోడ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వారిని వారించి తరువాత అధికారులు గోడ నిర్మించారు. గోడ నిర్మాణాన్ని అడ్డుకున్న మహిళలపై కేసునమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ప్రజా అవసరాల నిమిత్తం వంతెనపై ఏర్పాటు చేసిన గోడను ఎవరైనా కూలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఇదిలావుండగా, ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై నుంచి కోదాడ, హైదరాబాద్‌కు నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. దీంతో ఈ రూట్‌లో వచ్చే వాహనాలు రాపర్తినగర్ బ్రిడ్జిపై నుంచి వెళ్లేలా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అలాగే కాల్వొడ్డు ప్రాంతంలో భారీ వాహనాలకు అనుమతిలేకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు

ఉచిత విద్యుత్

- 1447 విద్యాసంస్థలకు లబ్ధి
- నెలకు రూ.35లక్షలు తగ్గనున్న భారం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 6: ప్రభుత్వ ప్రభుత్వ ఆధీనంలో నడిచే విద్యాసంస్థలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించనుంది. జిల్లాలోని 209 ఉన్నత పాఠశాలలకు, 1,155 ప్రైమరీ పాఠశాలలకు, 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 5 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఒక పీజీ కళాశాలతోపాటు, 16బీసీ గురుకులాలు, 33 బీసీ హాస్టల్స్, 7 మైనారిటీ కళాశాలలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించనుంది. నెలకు పాఠశాలలకు రూ.18లక్షలు, జూనియర్ కళాశాలలకు రూ.లక్షా20వేలు, డిగ్రీ కళాశాలలకు రూ.లక్షా40వేలు, బీసీ గురుకులం, హాస్టల్స్‌కు రూ.11లక్షలు, మైనారిటీలకు రూ.లక్షా50వేలు మొత్తం 35లక్షల వరకు భారం తగ్గనున్నది. ఈ డబ్బులను విద్యాసంస్థల అభివృద్ధి పనులకు వాడుకోవటానికి ఆయా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాల్స్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని విద్యాసంస్థలకు కొంత ఆర్థిక భారం తగ్గనుంది. ఈ నెల నుంచే ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించనుంది. దీంతో జిల్లావ్యాప్తంగా రూ.35లక్షల వరకు ఆదాయం ఆదా కానున్నది.



భద్రాచలం వద్ద గోదావరి

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

భద్రాచలం, సెప్టెంబరు 6: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. గురువారం సాయంత్రం 6 గంటల వరకు 45.5 అడుగులున్న గోదావరి నీటిమట్టం క్రమేపి తగ్గుతూ వచ్చింది. అర్ధరాత్రి 12 గంటలకు 44.9 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 8 గంటలకు 43.2, 9 గంటలకు 43.1, పది గంటలకు 43 అడుగులకు తగ్గింది. 11 గంటలకు 42.9 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. 12 గంటలకు 42.8 అడుగులున్న గోదావరి నీటిమట్టం మూడు గంటలకు 42.4, 6 గంటలకు 42 అడుగులకు తగ్గింది. రాబోయే 24 గంటల్లో గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కేంద్ర మంత్రుల పర్యటన చిత్రాలు


బాధితులకు భరోసా ఇస్తున్న కేంద్ర మంత్రులు


మంత్రి తుమ్మలతో ముచ్చటిస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్


పంట పొలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్


నష్ట తీవ్రతను తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి


నష్ట తీవ్రతను పరిశీలిస్తున్న చౌహాన్, సంజయ్,భట్టి, తుమ్మల, రఘురాం



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

మున్నేరు వరద ప్రభావ దృశ్యాలు


వరద ధాటికి ధ్వంసమైన ఇల్లు


ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగిస్తున్న దృశ్యం


సామగ్రిని శుభ్రం చేస్తుకుంటున్న బాధితులు


పుస్తకాలు ఆరబెట్టుకుంటున్న చిన్నారి


మున్నేరు ఒడ్డు


కూలిన ఇల్లును చూపుతున్న బాధితురాలు

మాజీమంత్రి హరీష్‌రావు వితరణ

- మున్నేరు వరద బాధితులకు నిత్యావసరాలు
- అందజేసిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం టౌన్, సెప్టెంబరు 6: సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఖమ్మం మున్నేరు వరద ముంపు బాధితులకు సిద్ధిపేట నుంచి ఖమ్మం పంపిన నిత్యావసర వస్తువులను డివిజన్ల వారీగా విభజించి, సదరు వాహనాలను శుక్రవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. మున్నేరు వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను ఇటీవల పరామర్శించి, వారికి నిత్యావసరాలు పంపుతామని మాజీమంత్రి హరీష్‌రావు ప్రకటించారు. ఆ మేరకు గురువారం సిద్ధిపేట నుంచి 2500 నిత్యావసరాల కిట్లను ఖమ్మం పంపారు. శుక్రవారం సదరు కిట్లను తొలుత 46వ డివిజన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా వరద బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, కర్నాటి కృష్ణ, పల్లా రోజ్‌లీనీ, దండా జ్యోతిరెడ్డి, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, ప్రసన్నకృష్ణ, కనకం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ మంత్రి పువ్వాడ, బీఆర్ఎస్ నాయకులు

జై జై గణేశా.. జై కొడతాం గణేశా...

- నేడు వినాయక చవితి పర్వదినం
- నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు మండపాలు సిద్ధం

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 6: వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక ప్రతిమలు, విగ్రహాలతో పాటు పత్రి, తదితరాలను కొనుగోలు చేశారు. చేసే ప్రతి పనిలోనూ విజయాలు దక్కాలని విఘ్నాలు తొలగి అంతా శుభమయం, సుఖమయం కావాలని కోరుతూ గణపతి పూజా క్రతువుకు, నవరాత్రి సంబురాలకు సిద్ధమయ్యారు. మున్నేరు వరదల మూలంగా ఈసారి గణపతి నవరాత్రుల వేడుకల నిర్వహణపై కొంత సందిగ్ధం ఉన్నప్పటికీ అందరికీ మంచి జరగాలన్న కోణంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానంగా అధిక వర్షాలు, వరదల భయం తగ్గి, బాధిత ప్రజలు త్వరగా కోలుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ ఏడాది వినాయక నవరాత్రులు కొనసాగనున్నాయి. వినాయకచవితి పండుగను జరిపేందుకు అవసరమైన పూజా సామగ్రి తదితర పండుగ వస్తువులు, పదార్థాల కొనుగోళ్ల కోసం జనం రోడ్డెక్కటంతో చాలారోజుల తరువాత పట్టణాల్లో సందడి నెలకొంది. ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్, పాత మునిసిపల్ ఏరియా, పటేల్ స్టేడియం తదితర ప్రాంతాల్లో రద్దీ ఏర్పడింది.

వినియోగదారుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విక్రయించేవారు శుక్రవారం ఉదయం పది గంటలనుంచే ఖమ్మం, తదితర పట్టణాలు చేరుకొని విక్రయాలకు అనువైన ప్రాంతాల్లో తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిమలను తయారు చేసే కళాకారులు మట్టిని తీసుకు వచ్చి అక్కడికక్కడే చిన్న చిన్న మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుండగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద విగ్రహాలను రాజస్థాన్‌కు చెందిన కళాకారులు తయారు చేసి విక్రయించారు. ఇతర వ్యాపారులు సైతం ఢిల్లీ, హైదరాబాద్ తదితర చోట్ల నుంచి పెద్ద పెద్ద విగ్రహాలను దిగుమతి చేసి స్థానికంగా విక్రయాలు జరిపారు. మట్టివిగ్రహాలపై అవగాహన పెంపొందించేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు, విద్య, వ్యాపార సంస్థలు, మట్టిప్రతిమలను ఉచితంగా అందజేశాయి. నవరాత్రి వేడుకల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద విద్యుత్, షామియానా, తదితర అలంకరణలు చేశారు. మరోవంక కొందరు భక్తులు గణపతి దీక్షలను స్వీకరించటంతో గాంధీచౌక్‌లోని వినాయక దేవాలయం రద్దీగా మారింది.


గణేష్ ప్రతిమలను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ముసురు వర్షాలు... మున్నేటి వరదల పరిస్థితులు ఈ దఫా వినాయకచవితి ఉత్సవాలపై కొంతమేర ప్రభావం చూపుతున్నాయి. మున్నేటి తీరం చాలావరకు వరద గుప్పిట్లో చిక్కుకొని ఉండటం.. స్థానికులు వరదకు గురై తీవ్రనష్టాలు, కష్టాల్లో ఉండటంతో ఈసారి వినాయక ఉత్సవాల పట్ల ఆసక్తి చూపడం లేదు. ప్రతి ఏటా నగరంలో 800నుంచి వెయ్యి వరకు విగ్రహాలు ఏర్పాటు అవుతున్నాయి. గతేడాది 1100 విగ్రహాల దాకా విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించారు. కాగా ఈసారి అంతటి స్థాయిలో విగ్రహాలను ఏర్పాటు చేసే సూచనలు కాన రావటంలేదు. కాగా, మున్నేటి వరదల నేపథ్యంలో ఈసారి నగరంలో వినాయక విగ్రహాల సంఖ్య 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు అశోక్ లాహోటి అంటున్నారు.

మావోయిస్టుల మృతదేహాలు
కుటుంబ సభ్యులకు అప్పగింత

- ఏరియా ఆసుపత్రి వద్ద పోలీసుల ఆంక్షలు
- మీడియాకు అనుమతి ఇవ్వని వైనం

మణుగూరు, సెప్టెంబరు6: పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం రఘునాథపాలెం సమీపంలో అడవిలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృత దేహాలను కరకగూడెం నుంచి గురువారం రాత్రి మణుగూరుకు తరలించారు. మృతదేహాలు రాత్రి 9.30కు మణుగూరు చేరుకున్నాయి. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఓఎస్‌డీ పరితోష్ పంకజ్ ఆసుపత్రికి చేరుకుని మృత దేహాలను మార్చురీలో ఉంచారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మీడియాను మార్చురీ గదివైపునకు పోనివ్వలేదు. గేటు వరకు మాత్రమే పరిమితం చేశారు. రాత్రి 1.47 సమయంలో మృతుల్లో ఉన్న మణుగూరు- పాల్వంచ దళ కమాండర్ కుంజ వీరయ్య అలియాస్ లచ్చన్న, అతడి భార్య తులసి మృత దేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం కోర్సా జోగయ్య అలియాస్ రాము మృత దేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా నాలుగురి మృత దేహాలు ఆసుపత్రి మార్చురీలోనే ఉన్నాయి.


జోగయ్య మృత దేహాన్నితీసుకువెళుతున్న బంధువులు

ఉధృత గోదావరిని దాటలేక..

- తెలంగాణ భూభాగంలో నిలిచిపోయిన మావోయిస్టులు..
- ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీసులు, కూంబింగ్‌తో మూల్యం
- 2 నెలలుగా ములుగు, భద్రాద్రి ఏజెన్సీలో లచ్చన్న దళం
- ఈ క్రమంలోనే రఘునాథపాలెం ఘటన..

హైదరాబాద్, చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. ఈ క్రమంలోనే భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతోపాటు తెలంగాణలో పట్టు సాధించేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పుడు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు. కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కె సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీసులు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరోవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంతకాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. అన్ని రాష్ట్రాల పోలీసులు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్రనేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక.. మావోయిస్టు పార్టీలో ఎన్నడూ లేని విధంగా విభేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

విడిపోయి పట్టుకోల్పోయి

విభేదాలు, ఎన్‌కౌంటర్లు, ఇతర పరిణామాలతో కొంతకాలంగా మావోయిస్టులు బృందాలుగా ఏర్పడి సంచరిస్తున్నారనే చర్చ సాగుతోంది. 30 నుంచి 50 మంది బృందాల్లో నేడు 10 మందే ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్లకు చిక్కుతున్నారని తెలుస్తోంది. కరకగూడెంలో ఏడుగురు, బీజాపూర్, దంతెవాడలో 10-15 మంది సభ్యులే ఉండడం గమనార్హం. ఏప్రిల్‌లో కర్రి గుట్టలపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉన్నారు. మావోయిస్టులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే బలగాలకు చిక్కుతున్నట్లు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో రెండు రోజుల్లో ఇద్దరు అగ్రనేతలు మృతి చెందారు. వీరిలో పార్టీలోని నాయకులు, సభ్యులకు దిశానిర్దేశం చేసే మొదటి తరం నాయకుడు రణదేవ్ దాదా ఉన్నారు. లచ్చన్న మృతి తెలంగాణలో మావోయిస్టు పార్టీకి కోలుకోని దెబ్బగా చెబుతున్నారు.

తెలంగాణలో అడుగుపెట్టనివ్వం: డీజీపీ జితేందర్

రాష్ట్రంలో మావోయిస్టులు అడుగు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పునరావాసం, ఆర్థిక సాయంతో సాధారణ జీవితం కొనసాగించాలన్నారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తప్పించుకున్న మావోయిస్టు నేత మాసయ్య

కరకగూడెం, సెప్టెంబరు 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం పంచాయతీ మోతే పరిసర ప్రాంత దోనాల గుంట అడవిలో గురువారం పోలీసుల మధ్య మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులలో మాసయ్య అనే మావోయిస్టు త్రుటిలో తప్పించుకున్నట్లు సమాచారం. తప్పించుకున్న మావోయిస్టు కోసం గ్రేహౌండ్స్ ప్రత్యేక బలగాలు అడవులను జల్లెడ పడుతున్నారు. తప్పించుకున్న మావోయిస్టు కోసం మండలంలోని రహదారులు, సరిహద్దు అయిన గుండాల, ఆళ్లపల్లి, పినపాక, మణుగూరు డివిజన్‌తో పాటు ములుగు జిల్లా మంగపేట, తాడ్వాయి, మంగపేట ప్రాంతాలలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు, కూంబింగ్ నిర్వహిస్తుండటంతో మారుమూల ఏజెన్సీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అడిషనల్ ఎస్పీ పంకజ్ పారితోష్ ఆదేశాల మేరకు ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఏడూళ్ళ బయ్యారం ఎస్ఐలు రాజేందర్, రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఆదివాసీ గ్రామాలలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. కొత్త వ్యక్తులు అనుమానితులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలుపుతున్నారు. గ్రేహౌండ్స్, ప్రత్యేక బలగాల పోలీసుల కూంబింగ్, తనిఖీలతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఏజెన్సీ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటు జీవనం సాగిస్తున్నారు.


కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలు

రైతులు కంటతడి పెట్టుకోవద్దు

(5వ పేజీ తరువాయి)

రాని స్థాయిలో వరదలు రావడంతో సాగు చేసిన వరి, మిర్చి, పత్తి పంటలు నీటమునిగాయన్నారు. ఇళ్లలోకి వరద రావడంతో ఖాళీ చేయాల్సి వచ్చిందని, పశువులు సైతం మృత్యువాత పడ్డాయని తెలిపారు. అపార నష్టం సంభవించిందని తెలిపారు. ఆయా గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోయాయని వివరించారు. ఒకదశలో ఆయన కన్నీటిపర్యంతమై కేంద్రమంత్రి చౌహాన్ కాళ్లపై పడబోయారు. వెంటనే చౌహాన్.. రైతును అనునయిస్తూ పైకిలేపారు. గోపె వెంకన్న అనే రైతు మాట్లాడుతూ పాలేరు వరద కారణంగా పెద్ద ఎత్తున పంట నష్టం సంభవించిందని పేర్కొన్నారు. ఇసుకమేటలు వేసిందని.. ట్రాక్టర్లు సైతం నీటిలో కొట్టుకుపోయాయని తెలిపారు. రైతులు ఎలా వ్యవసాయం చేయాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకవచ్చారు. సుమారు 5,350 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అనంతరం మంత్రి చౌహాన్ మాట్లాడుతూ రైతులు ఎవరూ కన్నీళ్లు పెట్టుకోవద్దని తెలిపారు. తప్పకుండా సాయం అందిస్తామని తెలిపారు. కేంద్రం ప్రతి రైతును ఆదుకుంటుందని అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరైతును రాష్ట్రంతో కలిసి సాయం అందించి ఆదుకుంటామని అన్నారు.

చట్ట వ్యతిరేకులపై కఠిన చర్యలు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి 6: కరకగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు ఆదివాసీ సాయుధ సభ్యులు చనిపోయారని.. వీరి చావుకు మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర నాయకులే కారణమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సురక్షిత ప్రాంతంలో తలదాచుకుంటూ అమాయకులైన కింది స్థాయి కేడర్‌ను ప్రగతి పథంలో ముందున్న తెలంగాణ రాష్ట్రంలో అశాంతి సృష్టించడానికి పావులుగా వాడుకుంటున్నారన్నారు.

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో
కేసీఆర్ చండీయాగం

ప్రతికూల పరిస్థితులు అధిగమించే సంకల్పం


చండీయాగానికి వెళ్తున్న కేసీఆర్

హైదరాబాద్, మర్కుక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో యాగం నిర్వహించారు. తన సతీమణి శోభతో కలిసి ఆయన నవగ్రహ మహాయాగం, చండీయాగం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటలవరకు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యాగ క్రతువును నిర్వహించారు. రాజకీయంగా ప్రతికూల వాతావరణం ఏర్పడటం, కేసుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితుల నుంచి బయటపడేందుకు వేద పండితుల సూచనమేరకు కేసీఆర్ ఈ యాగం నిర్వహించినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అధికారం చేపట్టాక కేసీఆర్ 2015లో చండీయాగం, 2018, 2023లో రాజశ్యామల యాగం చేశారు. అయితే, శుక్రవారం జరిపిన నవగ్రహ మహాయాగానికి అతికొద్ది మందే హాజరయ్యారు. మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆమె భర్త అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ అభ్యర్థుల వివరాలు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్) పోస్టుల భర్తీకై వచ్చిన అభ్యర్థుల వివరాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. వీటిలో అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 6 నుంచి 10వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు ఆన్‌లైన్ ద్వారా తెలపాలని మెడికల్ బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4838 మంది అభ్యర్థుల వివరాలను మెడికల్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం అందుబాటులో ఉంచింది. అభ్యర్థుల దరఖాస్తు నంబరు, పుట్టిన తేదీ, ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ఎక్కడ చదివారు? వారి సామాజిక వర్గం, ఎంబీబీఎస్‌లో వారు సాధించిన మార్కుల వివరాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సర్కారీ దవాఖానాల్లో ఎన్నిరోజులుగా పనిజేస్తున్నారు? లాంటి వివరాలను కూడా అందులో పేర్కొంది. అభ్యంతరాలను, సవరించవలసిన వివరాలను పీడీఎఫ్ ఫార్మాట్‌లో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఫార్మాసిటీ భూముల్లో లైఫ్ సైన్సెస్ పార్క్

» హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 12 వేల ఎకరాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టు భూముల్లో లైఫ్ సైన్సెస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఫార్మాసిటీ ప్రాజెక్టు ఇప్పటికీ కొనసాగుతోందా? రద్దయిందా? స్పష్టంగా చెప్పాలని ఈనెల 3న హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ సమాచారం ఇచ్చింది. ఫార్మాసిటీ భూసేకరణను గతేడాది హైకోర్టు కొట్టేసినప్పటికీ తమ భూములపై ఇప్పటికీ ప్రభుత్వం ఆంక్షలు కొనసాగిస్తోందని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన ఆరేపల్లి జంగయ్య సహా 49 మంది రైతులు, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. శుక్రవారం మరోసారి విచారణ జరిగినప్పుడు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీ భూముల్లో లైఫ్‌సైన్సెస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. దాంతో ఇదే విషయాన్ని పేర్కొంటూ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి 20లోగా అఫిడవిట్ రూపంలో సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయని మహంకాళి ఆలయ ఈవోకు జైలుశిక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ కాంట్రాక్టు విషయంలో హైకోర్టు ఆదేశాలు అమలు చేయనందుకు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ ఈవోకు నెలరోజుల జైలుశిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఇస్తూ 15 రోజులపాటు జైలుశిక్ష అమలును సస్పెండ్ చేసింది.

గోదావరిలో దూకిన కానిస్టేబుల్

» మానసికంగా కుంగిపోయి అఘాయిత్యం

» సెల్ఫీ వీడియోలో తన సమస్యల వెల్లడి.. భద్రాచలంలో ఘటన

భద్రాచలం, సెప్టెంబరు 6: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భార్య, అనుకోకుండా కారుతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడం, ఎంతో కష్టపడి కట్టుకున్న ఇలు వరద ముంపునకు గురి కావడం.. ఒకదాని తర్వాత మరొకటి నిత్యం ఏదో ఒక సమస్య ఎదురవుతుండడంతో మానసిక ఆందోళనకు గురైన ఓ పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన నీలం నాగరమణారెడ్డి.. పాల్వంచలో స్థిరపడ్డారు. కొత్తగూడెం టూటౌన్‌లో పోస్టింగ్‌లో ఉన్న రమణారెడ్డి కొంతకాలంగా జిల్లా క్లూస్ టీంలో పని చేస్తున్నారు. గత నెల 24న పాల్వంచలో కారు నడుపుతూ ఆగి వున్న లారీని ఢీ కొట్టి గాయపడిన రమణారెడ్డి ప్రస్తుతం సెలవు పెట్టి విధులకు దూరంగా ఉన్నారు. అయితే, భద్రాచలంలోని గోదావరి వారధిపైకి శుక్రవారం వెళ్లిన రమణారెడ్డి తన చెప్పులు, సెల్‌ఫోన్‌ను వంతెనపై ఉంచి నదిలోకి దూకేశారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించారు. చీకటి పడే వరకు గత ఈతగాళ్లు గాలించినా రమణారెడ్డి ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలను శనివారం కొనసాగించనున్నారు. కాగా, 'నా కుటుంబం మీద ఏదో విషం చిమ్మినట్లు అనిపిస్తోంది. నేను నా జీవితాన్ని ఇంతకంటే ముందుకు తీసుకెళ్లలేకపోతున్నాను. ఈ మానసిక ఒత్తిడిని తట్టుకోలేను.. దయచేసి క్షమించండి' అని రమణారెడ్డి సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. కారు ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని, భయం భయంగా ఉంటోందని రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కష్టపడి కట్టుకున్న ఇల్లు వరద ముంపునకు గురైందని, 40 ఏళ్లకే తన భార్యకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయని బాధపడ్డారు. మానసిక సమస్యల వల్లే రమణారెడ్డి అఘాయిత్యానికి పాల్పడ్డారని భావిస్తున్నారు.

మంత్రి సీతక్కకు ఫోన్లో దూషణలు

» పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

పంజాగుట్ట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి డి.అనసూయ(సీతక్క)కు పదే పదే ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. బేగంపేట జ్యోతిరావు పూలే ప్రజా భవన్ ఆవరణలోని ఓ భవనంలో మంత్రి అనసూయ నివాసం ఉంటున్నారు. ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తి సాయంత్రం 4.03, 4.05, 4.56 గంటల ప్రాంతంలో మంత్రి మొబైల్‌కు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె సూచనతో కారు డ్రైవర్ ఎం.శ్రీను పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.మొబైల్ నెంబర్ ఆధారంగా నిందితుణ్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

హరీశ్‌రావు వ్యాఖ్యలు దురుద్దేశపూరితం

» విమర్శలను ఖండించిన పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను పోలీస్ అధికారుల సంఘం ఖండించింది. బీఆర్ఎస్ హయాంలో పోలీస్ అధికారులకు ఏ మాత్రం స్వేచ్ఛ ఉండేదో మీకు తెలియదా? అని ప్రశ్నించింది. కాంగ్రెస్ పాలనలో పోలీస్ వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని, బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని హరీశ్ శుక్రవారం విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి స్పందించారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని వ్యాఖ్యానించారు. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న వారే.. ఈ విధంగా పోలీసులను విమర్శించడం సరి కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులకు ఏ మాత్రం స్వేచ్ఛ ఉండేదో హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీ పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నిర్ణయం తీసుకున్నారని, ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఇంతకాలం పీసీసీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించిన సేవలను పార్టీ ప్రశంసిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో గౌడ సామాజికవర్గం నుంచి ఎంపికైన తొలి పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నిలిచారు. అలాగే టీపీసీసీకి నాలుగో అధ్యక్షుడిగా నియమితుడయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. మూడేళ్లుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ సంస్థాగత వ్యవహారాలు చూస్తున్నారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్‌రెడ్డి పదవీకాలం పూర్తయిన దగ్గర్నుంచి నూతన అధ్యక్ష నియామకంపై అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెడ్డి సామాజిక వర్గానికి సీఎం పదవి ఉన్న నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలంటూ ఆ వర్గానికి చెందిన పలువురు నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీ నేతలూ తమ సామాజిక వర్గాలకు కేటాయించాలని హైకమాండ్‌ను అడిగారు.

అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వచ్చినా..

రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులతో అధిష్ఠానం ప్రాథమికంగా చర్చించినప్పుడు.. బీసీ వర్గం నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేశ్ షెట్కార్, అంజన్‌కుమార్ యాదవ్, ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్టీల నుంచి మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్లు ప్రతిపాదనలోకి వచ్చాయి. అధిష్ఠానంతో పలు మార్లు భేటీ అయిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్.. ఓవైపు సామాజికవర్గాల వారీగా ప్రతిపాదిత పేర్లపై చర్చిస్తూనే.. మరో వైపు ఏ సామాజిక వర్గం నుంచి నూతన చీఫ్‌ను ఎంపిక చేయాలన్నదానిపై చర్చలు జరిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ మాదిగకు ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చ నడిచినా.. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో దానిని పక్కన పెట్టారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా బీసీలే అయినందున.. ఈ వర్గం నుంచే ఎంపిక చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధిష్ఠానం పెద్దలు వ్యక్తం చేశారు. అయితే ఎస్టీలకు టీపీసీసీ చీఫ్ పోస్టు ఇస్తే.. దేశ వ్యాప్తంగా దీని ప్రభావం ఉంటుందన్న అభిప్రాయాన్ని సీఎం రేవంత్ అధిష్ఠానం ముందు వెలిబుచ్చినట్లు సమాచారం. ఎంపీ బలరాంనాయక్ పేరును ఆయన సూచించినట్లు తెలిసింది. బీసీల్లో నైతే ఎవరికి ఇచ్చినా పరస్పరం సహకరించుకుంటామన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేసినట్లు సమాచారం.

అధిష్ఠానం మార్కు నిర్ణయం..

సంప్రదాయకంగా సీఎం రేవంత్ సహా పార్టీ ముఖ్య నాయకులందరి అభిప్రాయాలనూ తీసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. తాను అనుకున్నట్లుగా బీసీలకే టీపీసీసీ చీఫ్ పోస్టు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చింది. ప్రతిపాదిత పేర్లపై సమీక్ష చేసి మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌లలో ఒకరిని నియమించాలనుకుంది. దీనిపై రాష్ట్రంలో ఫ్లాష్ సర్వేలు నిర్వహించి.. మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకానికే ఓటేసింది. మొత్తమ్మీద అధ్యక్ష నియామకంలో తన ముద్రను బలంగా చూపించింది. విద్యార్థి దశనుంచీ కాంగ్రెస్ రాజకీయాల్లోనే ఉండడం, ఎన్ఎస్‌యూఐ నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు పని చేసిన అనుభవం ఉండడం.. ముఖ్యంగా గత మూడేళ్లుగా పార్టీ సంస్థాగత వ్యవహారాలను చక్కబెడుతుండడాన్ని పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం.. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీకి కొత్త చీఫ్‌గా నియమించింది.



మహేశ్‌కుమార్‌గౌడ్ బయోడేటా...	
పేరు	బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
తండ్రి పేరు	గంగాధర్‌గౌడ్
పుట్టిన తేదీ	ఫిబ్రవరి 24, 1966
పుట్టిన ఊరు	రహమత్‌నగర్
ఎడ్యుకేషన్	బీకాం
భార్య పేరు	సంధ్యారాణి
కుమారులు	రిత్విక్, ప్రణవ్

కార్యవర్గం కూర్పుపైనా కసరత్తు..

టీపీసీసీకి కొత్త చీఫ్‌ను ప్రకటించిన అధిష్ఠానం.. కార్యవర్గం కూర్పుపైనా కసరత్తు చేసింది. టీపీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార.. ఇతర కమిటీల చైర్మన్ల నియామకంపైనా కసరత్తు జరిగినట్లు చెబుతున్నారు. నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను రెడ్డి, మైనారిటీ, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించే అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరు వినిపిస్తోంది. టీపీసీసీ చీఫ్ పదవికి చివరి వరకూ పోటీలో ఉన్న మధుయాష్కీగౌడ్‌కు ఏఐసీసీలోగానీ, రాష్ట్రంలోగానీ కీలక పదవి ఇచ్చే ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది.

దత్తాత్రేయుని సన్నిధిలో ఉండగా..

కర్ణాటకలోని గానుగాపురం దత్తాత్రేయుని సన్నిధిలో మహేశ్‌కుమార్‌గౌడ్ ఉండగా.. అధిష్ఠానం పెద్దలు ఆయనకు ఫోన్ చేసి టీపీసీసీ చీఫ్‌గా నియమితులైనట్లు తీపి కబురు చెప్పారు. ఆ ఉత్సాహంలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్.. అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శనివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. సీఎంతో భేటీలో.. బాధ్యతల స్వీకరణ ముహూర్తం ఎప్పుడన్నది స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అధిష్ఠానానికి ధన్యవాదాలు: మహేశ్

తనపై అత్యంత నమ్మకముంచి కీలకమైన టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన అధిష్ఠానానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు.. పార్టీ కోసం అనునిత్యం పాటుపడుతున్న కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకొంటున్నానన్నారు. అంకిత భావంతో పనిచేసి.. పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తానని అన్నారు.

ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలోనే...

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహమత్‌నగర్‌కు చెందిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐలో చేరారు. అప్పటినుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సామాజిక సమీకరణాల వల్ల అవకాశం రాకున్నా.. వివిధ హోదాల్లో పార్టీలో పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా 1986 నుంచి 1990 వరకు పనిచేశారు. ఆ తర్వాత 1990లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై 1998 వరకు పనిచేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా 1998 నుంచి 2000 వరకు పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో ఆయన సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. మొదట పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా 2000 నుంచి 2003 వరకు పనిచేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా 2012 నుంచి 2016 వరకు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2016 నుంచి 2021 వరకు కొనసాగారు. 1994లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన 2014లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ పడ్డారు. తర్వాత మళ్లీ అవకాశం రాలేదు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో 2013లో రాష్ట్ర వేర్ హౌజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై ఆయన రెండేళ్ల పాటు కొనసాగారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు నేతలు పార్టీ మారినా ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగారు. పీసీసీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు 2021లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశాన్ని కల్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనను గత జనవరిలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు.

ఇక.. కళకళలాడనున్న గాంధీభవన్!

టీపీసీసీ అధ్యక్షుడిగానూ సీఎం రేవంత్‌రెడ్డే ఉన్న నేపథ్యంలో.. పార్టీ కార్యక్రమాల కోసం ఆయన వచ్చిన వచ్చినప్పుడే గాంధీభవన్.. నేతలతో కళకళలాడుతున్న పరిస్థితి ఇప్పటి వరకూ ఉంది. అధ్యక్ష బాధ్యతలను మహేశ్‌కుమార్‌గౌడ్ స్వీకరించిన తర్వాత.. ఆయన నిత్యం గాంధీభవన్‌లో అందుబాటులో ఉండనున్నారు. దీంతో ఇక మీదట గాంధీభవన్ నిత్యం నేతలతో కళకళలాడనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నిజామాబాద్ నుంచి డీఎస్ తర్వాత రెండో వ్యక్తి..

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్ తర్వాత నిజామాబాద్ జిల్లా నుంచి మళ్లీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కే అవకాశం దక్కింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో పీసీసీ అధ్యక్షుడిగా రెండు దఫాలు డి.శ్రీనివాస్ పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో జిల్లా నుంచి డీఎస్‌కు అవకాశం దక్కగా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహేష్‌కుమార్‌గౌడ్‌కే దక్కింది. ఇద్దరు కూడా బాల్కొండ నియోజకవర్గానికి చెందిన నేతలే. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. నిజామాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

విధేయతకు దక్కిన గౌరవం

» మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ నేతల అభినందనలు

» బీసీలకు సముచిత ప్రాధాన్యం దక్కింది: పొన్నం ప్రభాకర్

» రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలపడుతుంది: జూపల్లి

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీకి నూతన అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ ముఖ్య నాయకులు వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు. ఇది విధేయతకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకంతో బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం దక్కిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వం, మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కాగా, మహేశ్‌కుమార్ గౌడ్ సారథ్యంలో బీసీలకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టడం సరైనదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకం పట్ల టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు తూర్పు జగ్గారెడ్డి, గీతారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తదితరులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. గాంధీభవన్‌లో పలువురు నేతలు బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.

ఏఐ సిటీలో వరల్డ్ ట్రేడ్ సెంటర్

» 10 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు

» డబ్ల్యూటీసీఏతో రాష్ట్ర సర్కారు ఎంవోయూ

» ఈ సెంటర్ పూర్తయితే ఐటీ ఎగుమతులు

» 200 బిలియన్ డాలర్లకు : మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కృత్రిమ మేధ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రతిపాదిత ఏఐ సిటీలో ప్రపంచ స్థాయి వరల్డ్ ట్రేడ్ సెంటర్(డబ్ల్యూటీసీ) ఏర్పాటుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే శంషాబాద్, జీనోమ్ వ్యాలీలో రెండు వరల్డ్ ట్రేడ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి అదనంగా ఏఐ సిటీలో మరో వరల్డ్ ట్రేడ్ సెంటర్ రానుంది. హైదరాబాద్‌లో ప్రారంభమైన ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో మరో డబ్ల్యూటీసీని ఏర్పాటు చేయడానికి వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ అసోసియేషన్(డబ్ల్యూటీసీఏ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో డబ్ల్యూటీసీఏ ప్రతినిధులు అవగాహన ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 'ఫోర్త్ సిటీ' ఏర్పాటుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులోనే 10 లక్షల(మిలియన్) చదరపు అడుగుల విస్తీర్ణంతో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో అత్యధిక విస్తీర్ణంతో ఏర్పాటవుతున్న సెంటర్ ఇదే కావడం గమనార్హం. ఇందులో ప్రపంచ స్థాయి ఆఫీస్ స్పేస్, వాణిజ్య సేవలు, శిక్షణ సౌకర్యాలు, చిల్లర వ్యాపారం, ఇతర వినోద జోన్లు, నివాస ప్రదేశాలు, విలాసవంతమైన హోటల్, ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒక మినీ సిటీని ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభిమతం మేరకు డబ్ల్యూటీసీ ఏర్పాటు కానుంది. 'వాక్-టు-వాక్' విధానంలో ఇక్కడ సకల సౌకర్యాలు కల్పిస్తారు. అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ఏఐ సిటీలో మరో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు కానుండడంతో రాష్ట్ర నుంచి ఐటీ ఎగుమతులు 32 బిలియన్ డాలర్ల నుంచి 200 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో మమేకమై ఆర్థిక వృద్ధిని సాధిస్తుందనడానికి, ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుందనడానికి ఇదే తార్కాణమని అన్నారు. ఏఐని పూర్తిగా ప్రజాస్వామ్యీకరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీని ఫలాలను అన్ని వర్గాలకు సమానంగా పంచుతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతి సాధించాలంటే ఏఐ సేవలు అవసరమని అభిప్రాయపడ్డారు. డబ్ల్యూటీసీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాబిన్ వాన్ పుయెన్‌బ్రోక్ మాట్లాడుతూ ఏఐ సిటీలో ఏర్పాటు చేసే డబ్ల్యూటీసీకి తెలంగాణ ప్రభుత్వం వెంటనే లైసెన్స్ మంజూరు చేయడాన్ని అభినందించారు. కొత్త వరల్డ్ ట్రేడ్ సెంటర్లకు లైసెన్సులు పొందడం సుదీర్ఘ కసరత్తు అని, ఇక్కడ రికార్డు స్థాయిలో వారంలోనే లైసెన్సు పొందామన్నారు.


మంత్రి దుద్దిళ్ల సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకుంటున్న డబ్ల్యూటీసీఏ ప్రతినిధులు

వైద్య రంగంలో ఏఐతో సమస్యలూ ఉన్నాయ్!

» దేశంలో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధ అమల్లోకి రావాలంటే ఇంకా ఐదారేళ్లు పడుతుంది

» ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)తో వైద్య రంగంలో సమస్యలు కూడా ఏర్పడవచ్చని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్‌లో పలు సమస్యలు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏఐ సదస్సులో భాగంగా శుక్రవారం 'ఏఐ- ట్రాన్స్‌ఫార్మింగ్ పేషెంట్ కేర్- డయాగ్నసిస్ అండ్ ట్రీట్మెంట్' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో మాట్లాడారు. భారత్‌లో సైబర్ సెక్యూరిటీ అతిపెద్ద సమస్య అన్నారు. ఇటీవలే ఎయిమ్స్ సమాచారాన్ని చైనాకు చెందిన హ్యాకర్లు తస్కరించారని గుర్తుచేశారు. ఇతర ప్రైవేటు ఆస్పత్రుల వద్ద ఉన్న రోగుల డేటా భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ లేకుండా ఏఐ వినియోగం ప్రతికూల ప్రభావం చూపిస్తుందని అభిప్రాయపడ్డారు. అమెరికా ఆస్పత్రుల్లోని 80 శాతం వెంటిలేటర్లు ఏఐ టెక్నాలజీతో అనుసంధానమై ఉంటాయని, వాటిని ఎక్కడి నుంచైనా నియంత్రించవచ్చని చెప్పారు. అక్కడ పటిష్ఠ వ్యవస్థ అందుబాటులో ఉన్నందున ఏఐ సాంకేతికతను విజయవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. కానీ, భారత్‌లో ఇంకా అలాంటి పరిస్థితి లేదన్నారు. ఇక్కడ వైద్య రంగంలో ఏఐ పూర్తిస్థాయిలో అమల్లోకి రావాలంటే ఐదారేళ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు.

బుడమేరులో రంగంలోకి సైన్యం

» 120 మంది మద్రాస్ బెటాలియన్ జవాన్ల రాక

» యుద్ధ ప్రాతిపదికన మూడో గండి పూడ్చే పనులు

» నేటి ఉదయానికి పూర్తయ్యే అవకాశం


నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు రాడ్లులతో వంతెన నిర్మిస్తున్న సైన్యం

జి.కొండూరు, సెప్టెంబరు 6: వరద కారణంగా బుడమేరు వరద మళ్లింపు కాలువ (బీడీసీ) ఎడమ కట్టకు పడిన గండ్ల పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మొత్తం 3 ప్రధాన గండ్లలో ఇప్పటికే 2 గండ్లు పూడ్చగా అతి పెద్దదైన మూడో గండి పూడ్చివేత శనివారం ఉదయానికి పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ పల్లపు ప్రాంతాలను అతలాకుతలం చేసిన బుడమేరు వరద నుంచి బాధితులను కాపాడేందుకు, సహాయ చర్యలు ముమ్మరంగా చేసేందుకు బుడమేరు వరద గండ్ల ద్వారా విజయవాడ వైపు రాకుండా చేయాల్సి ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి సైన్యాన్ని రంగంలోకి దించారు. మద్రాసు 6వ బెటాలియన్ నుంచి 120 మంది జవాన్లు వచ్చారు. వారు తాత్కాలికంగా రాడ్లులతో వంతెన నిర్మాణం చేసి.. అందులో రాళ్లు వేసి గండి పూడ్చేందుకు యత్నిస్తున్నారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 4వ కిమీ వద్ద 60 మీటర్లు, 4.1 కిమీ వద్ద 50 మీటర్ల మేర పడిన గండ్లలో 4.1, 4 కిమీ వద్ద ఏర్పడిన గండ్లను శుక్రవారం మధ్యాహ్నానికి పూడ్చివేశారు. 3.9వ కిమీ వద్ద పడిన 100 మీటర్ల గండిని సాయంత్రానికి 20 శాతం పూర్తి చేశారు.

పాత ఫ్యాకల్టీని తీసుకునేలా పోరాడుతాం

» గౌలిదొడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రుల భరోసా

రాయదుర్గం, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో పాత ఫ్యాకల్టీని ప్రభుత్వం తిరిగి తీసుకునేలా తాము పోరాడుతామని.. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్వర్ రెడ్డి, గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. గురువారం వారు గౌలిదొడ్డిలోని బాల, బాలికల ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కళాశాలలో ఉపాధ్యాయులను ఉన్నపళంగా తొలగించారని.. కొత్త ఫ్యాకల్టీ చెప్పే పాఠాలు అర్థం కావడానికి కొంత సమయం పట్టేలా ఉందని విద్యార్థులు వారికి తెలిపారు. పోటీ పరీక్షల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సమస్య తమకు ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. తమ విద్యా సంవత్సరం పూర్తయ్యేదాకా కొత్త వారితో పాటు పాత వారిని కొనసాగిస్తే తమకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రులు.. దశాబ్ద కాలంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారు మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను ఒక్క సంతకంతో రాత్రికి రాత్రి తొలగించడమంటే విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయడమేనని మండిపడ్డారు. గురుకుల పాఠశాల వ్యవస్థనే ఈ ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. విద్యార్థులంతా మెచ్యూరిటీతో మాట్లాడుతున్నారని.. వారిని చూసైనా ముఖ్యమంత్రి, మంత్రులు బుద్ధి తెచ్చుకోవాలని జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. వారితో వారానికి ఒకసారైనా ఇంటరాక్ట్ అయితే సీఎంకు, మంత్రులకు జ్ఞానం పెరుగుతుందన్నారు. పేద విద్యార్థుల విద్యాలయాలపై ఈగ కూడా వాలకుండా చూద్దామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శనివారం 7 సెప్టెంబరు 2024

త్వరలోనే సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్: ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు, సెప్టెంబరు 6: జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయించి ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్‌తో ఆయన కొత్తగూడెంలోని ఎదురుగడ్డలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి సీహెచ్‌సీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న పరికరాలు, వసతులు, వివరాలతో కూడిన నివేదికను అందించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహా దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తొలి పూజకు వేళాయె..

నేడు వినాయక చవితి.. ఏర్పాట్లు సిద్ధం.. మార్కెట్లో సందడి

వాడవాడనా విగ్రహాల ఏర్పాటుకు సన్నద్ధం

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 6: తొలిపూజలందుకునే వినాయకుడి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం వినాయక చవితి పర్వ దినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు భక్తులు వినాయక ప్రతిమలు, పూలు, పండ్లు, పత్రులతోపాటు పూజా సామాగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు తరలి వచ్చారు. దీంతో వ్యాపార కూడలన్నీ సందడిగా మారాయి. గల్లీగల్లీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు నిర్వాహాలు సర్వం సిద్ధం చేసుకున్నారు. గణనాథుల విగ్రహాలను తరలించి కొలువుదీర్చారు. తమ భక్తిని చాటుకునేందుకు ఉత్సవ నిర్వాహకులు వినాయక మండపాలను భారీ సెట్టింగ్‌లతో అలంకరించి వేడుకలకు సిద్ధమయ్యారు.

నవరాత్రులకు ముమ్మర ఏర్పాట్లు

అశ్వారావుపేట టౌన్/రూరల్: గణపతి నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా వాడవాడలా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధం అయ్యారు. అశ్వారావుపేట పట్టణంలోని ప్రసిద్ధ ఆలయం లక్ష్మీగణపతి ఆలయంతో పాటు దాదాపు 40 ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ప్రతిచోటా దాదాపు 9 రోజుల పాటు గణనాథుడు పూజలు అందుకోనున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఊరిలో నాలుగైదు ప్రాంతాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు యువత, నిర్వాహకులు సిద్ధం అయ్యారు. ప్రతిచోటా నవరాత్రులకు పందిళ్లు వేయటం, విద్యుత్తు అలంకరణ పనులు చేయటం ముమ్మరంగా సాగుతున్నాయి.



కొత్తగూడెంలో పత్రి కొనుగోలు



'పేట'లో విక్రయానికి సిద్ధంగా గణపయ్యలు

భారీగా పెరిగిన ధరలు

గణపతి నవరాత్రులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి విగ్రహాలే. నిర్వాహకులు కూడా ప్రతిసారి గతానికి భిన్నంగా విగ్రహాలను కొనుగోలు చేసుకుని ప్రతిష్ఠించుకుంటారు. ఉత్సవాలకు ముందుగానే అంటే 15 రోజులు ముందుగానే విగ్రహాల కొనుగోలును ప్రారంభిస్తారు. కొంత అడ్వాన్స్ కూడా చెల్లిస్తారు. అయితే ఈ సారి పూజలు అందుకునే గణపయ్య విగ్రహాల ధరలు గణనీయంగానే పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రెండు అడుగుల నుంచి పది అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు ఉన్నాయి. ఒక్కో విగ్రహం ధర రూ.5000 నుంచి రూ.30000 వరకు ఉన్నాయి. ప్రస్తుతం అశ్వారావుపేటలో ఉన్న విగ్రహాల విక్రయ కేంద్రం కొనుగోలుదారులతో సందడి సందడిగా మారింది. అశ్వారావుపేటతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నిర్వాహకులు, ఆంధ్రాలోని జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిర్వాహకులు కూడా అశ్వారావుపేటకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. కొందరు అయితే ఇప్పటికే గణనాథులను తమ గ్రామాలకు తరలించి భద్రపరుచుకున్నారు.

పంటలను పరిశీలించిన ఏడీఏ

బూర్గంపాడు, సెప్టెంబరు 6: మండల పరిదిలో దెబ్బతిన్న పంటలను ఏడీఏ తాతారావు పరిశీలించారు. శుక్రవారం బూర్గంపాడు మండల పరిదిలోని ఉప్పుసాక, టేకులచెరువు గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 6: అశ్వారావుపేటలో శుక్రవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆర్యవైశ్యసంఘం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో లేపాక్షి ఐరన్ షాపు సహకారంతో వినాయక మట్టి విగ్రహాల పంపిణీ జరిగింది. భద్రాచలం రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల పంపిణీని సీఐ కరుణాకర్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దుర్గారావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, ఆంధ్రజ్యోతి ఆర్‌సీ ఇన్‌చార్జీ శీమకుర్తి శ్రీనివాసరావు, రిపోర్టర్లు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, శీమకుర్తి రవి, నార్లపాటి రాజశేఖర్, సంఘాల బాధ్యులు తోకల సత్యనారాయణ, హరీష్ గుప్త, జితేంద్ర, లోక్‌నాథ్ గుప్త, ఆర్యవైశ్యసంఘం జిల్లా నాయకులు సుమాకర్, శ్రీను రవి, దేవరాజ్, యూఎస్.ప్రకాశరావు, కంచర్ల రమేశ్, సంపూర్ణ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

భద్రాచలం, సెప్టెంబరు 6: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ పీవోలు, గిరిజన సంక్షేమ శాఖ డీడీలు, డీటీడీవోలు, ఆర్‌సీవో, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో ఉండే ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే పిల్లలను బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జున పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలను సందర్శించిన పీవో

భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలను ఐటీడీఏ పీవో బి.రాహుల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని గ్రంథాలయం, ఇతర ల్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. లైబ్రరీలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉంచాలని న్యూస్ పేపర్లు, కెరియర్ గైడెన్సు మీద దృష్టిపెట్టే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

పరిమితికి మించిన వైద్యం నేరం

దుమ్ముగూడెం, సెప్టెంబరు 6: గ్రామీణ వైద్యులు పరిమితికి మించిన వైద్యం చేయొద్దని దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి హెచ్చరించారు. మండల గ్రామీణ వైద్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్, యాంటీ బయాటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్లను రోగులకు ఇవ్వడం నేరమని సూచించారు.

పోలీసుల తొందర పాటు చర్య: అయోధ్య

మణుగూరు సెప్టెంబర్ 6: మణుగూరు మండలంలోని రామానుజారం పంచాయితీ పగిడేరు గ్రామంలో నక్సలైట్లు 60 ఏళ్ల క్రితమే ఇక్కడ జెండాలను ఎగుర వేసిన చరిత్ర ఉందని గత ఏడాదిగా ఈ ప్రాంతంలో ఎలాంటి అలజడి, హింసాత్మక సంఘటనలు జరగలేదని సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది తర్వాత కరకగూడెం మండలంలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌తో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు చనిపోయిన విషయం తెలిసిందన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. ఈ విషయంలో పోలీసులు తొందర పాటు చర్యకు పాల్పడినట్లు తాను భావిస్తున్నానని తెలిపారు.

మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించండి

మణుగూరు, సెప్టెంబరు 6: మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమలను వినాయక చవితి పూజల్లో వాడాలని పర్యావరణాన్ని కాపాడాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచంద్ర్ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కార్యాలయ అధికారులకు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు.

అడవిని ఆక్రమిస్తే కేసులు: డీఎఫ్‌వో

మణుగూరు, సెప్టెంబరు 6: మణుగూరు కమాలపురం గ్రామంలో అక్రమణలకు గురౌతున్న అటవీ ప్రాంతాన్ని జిల్లా ఫారెస్టు అధికారి కృష్ణ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్థులతో మాట్లాడారు. అడవులను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. ఫారెస్టు సిబ్బంది విధులను అడ్డుకున్నా ఫారెస్టు భూములను ఆక్రమించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

వివాదస్పద భూముల పరిశీలన

దుమ్ముగూడెం, సెప్టెంబరు 6: దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి పర్ణశాల సెక్షన్‌లోని వివాదస్పద పోడు భూముల్ని ఎఫ్‌డీవో సుజాత శుక్రవారం పరిశీలించారు. గౌరారం గ్రామపంచాయతీకు చెందిన 23 మంది ఆదివాసీ రైతులు తాము చేసిన పోడులో సాగు చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి ఉమ్మడి తనిఖీ అనంతరం రిజర్వ్ ఫారెస్టు భూమిగా గుర్తించినట్లు రేంజి అధికారి కమల తెలిపారు. సదరు భూమిలో అటవీశాఖ సిబ్బంది కొద్దిరోజుల క్రితం సుమారు పన్నెండు వేల మొక్కలు నాటగా, వాటిలో ఆరువందల మొక్కల వరకు కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు. జాయింట్ ఇనస్పెక్షన్ నివేదికను కోర్టుకు సమర్పిస్తామన్నారు. కాగా ఇన్‌స్పెక్షన్ విషయం తమకు తెలపలేదని కోర్టును ఆశ్రయించిన ఆదివాసీలు అంటున్నారు. రేంజి అధికారి కమల, ఎఫ్ఎస్ఓ నందా పాల్గొన్నారు.

'నిస్వార్థంగా పనిచేసేది బీఎంఎస్‌నే'

కొత్తగూడెం, సింగరేణి, సెప్టెంబరు 6: దేశవాష్ఠంగా కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీకెఎంఎస్-బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల జాగరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీవీ కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏబీకెఎంఎస్-బీఎంఎస్ కార్యదర్శి మాధవ నాయక్, జేబీసీసీఐ, సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్టుబోర్డు సభ్యులు మాట్లాడుతూ.. సింగరేణి ఎన్నికలు జరిగి 9 నెలలు గడుస్తున్నా గుర్తింపు పత్రం సాధించని యూనియన్లు హక్కులు ఎలా సాధించగలవని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా పనిచేసేది బీఎంఎస్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు బి రాంసింగ్, కార్పోరేట్ కార్యదర్శి, ఊట్ల గణేష్, కార్పోరేట్ కొత్తగూడెం ఇంఛార్జ్ సంగెం చందర్, ఎం శ్రీనివాస్, వై వీరయ్య, వీర కుమార్, అల్లి ప్రకాశ్‌రావు, రాజమౌళి పాల్గొన్నారు.

60 కుటుంబాలు సీపీఐలో చేరిక

సుజాతనగర్, సెప్టెంబరు 6: సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామ పంచాయతీలో వివిధ గ్రామాల నుంచి 60 కుటుంబాలు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా సమక్షంలో సీపీఐ, అనుబంధ ప్రజాసంఘాల్లో చేరారు. శుక్రవారం జరిగిన పంచాయతీ స్థాయి సమావేశం సందర్భంగా వీరికి నాయకులు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలకు ఏకష్టం వచ్చినా వారికి అండగా నిలబడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నున్నా లక్ష్మయ్య, సెనగ భిక్షమయ్య, బత్తుల కొండయ్య, నున్నా నగేష్, సత్యం, లింగయ్య, ఉప్పలయ్య, మల్లిఖార్జున్ నేతృత్వంలో 60 కుటుంబాలు సీపీఐలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి భూక్యా దస్రు, హనుమంతరావు, శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, రాంబాబు, గణేష్, చారి, రాములు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత: ఎమ్మెల్యే

ఇల్లెందు టౌన్, సెప్టెంబర్ 6: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద రోగులకు ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 104 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద రోగులకు వివిధ రకాల వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కోట్లాది రూపాయాలను వెచ్చిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు డానియల్, మండల నాయకులు పులి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్

కొత్తగూడెం సాంస్కృతికం,సెప్టెంబరు 6: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని.. అందులో బాగంగా అందరూ వినాయకమట్టి ప్రతిమలను పూజించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయ ప్రతిమల పంపిణీలో కలెక్టర్ పాల్గొని వినాయక ప్రతిమలను పంపిణీ చేసారు. కొత్తగూడెం మున్సిపల్, అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 4000 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

క్రీడాకారుల గని భద్రాద్రి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: క్రీడాకారుల గని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని, జిల్లాలో ప్రతిభకు కొదవ లేదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీలోని తన ఛాంబర్‌లో ఇటీవలే అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ 66 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన మోడెం వంశీని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరప్ ఖండం మాల్టా దేశంలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసి, జాతీయ జెండా ఎగురవేసిన క్రీడాకారుడు వంశీకి అభినందనలు తెలిపారు. అనంతరం వంశీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వి.నరేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.మల్లేష్, జిల్లా అధ్యక్షుడు బోగల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలి

కొత్తగూడెం : తక్కువ సాగు భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువగా ఆదాయం వచ్చే పంటలను మహిళా రైతులు సాగు చేసే విధంగా ముందుకు రావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మహిళా శక్తిలో పాడి గేదెలు, చేపల పెంపకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆక్వా మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ కొరమేను చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యా చందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, నాబార్డు, వ్యవసాయ శాఖ, హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.

కారుకొండ బౌద్ధధ్యాన మందిరాలను అబివృద్ధిలోకి తెస్తాం

కారుకొండ గుట్టలపై ఉన్న ప్రాచీన కాలం నాటి బౌద్ధద్యాన మందిరాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ గుట్టలపై ఉన్న బౌద్ధద్యాన మందిరాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరాల విశిష్టత, చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ.. కారుకొండ గుట్ట పరిసరాల చుట్టూ రక్షణ కల్పించి సోలార్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీవో శ్రీనివాసరావు, బుద్ధిష్టు సోసైటీ ఆఫ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు అంతోటి నాగేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చర్ల కమలా రాణి, మారపాక రమేష్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, సింగరేణి డీవైజీఎం బీభత్స పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 6: మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ ఢాకూ నాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మట్టి ప్రతిమలను ఉచిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి ప్రతిమలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ కేవీ లక్ష్మణరావు, ఎస్ఏ రవిప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. గాంధీ ఫౌండేషన్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి ప్రతిమలను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్ చేతుల మీదుగా అందజేశారు. దుర్గాప్రసాద్, సాయికుమార్, శ్రావణ్, కిరణ్, రంజిత్, నవీన్, మీరావతి, ప్రమోద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రీన్‌ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు రమేస్ రాథోడ్ ఆద్వర్యంలో కేపీస్పీ రోడ్డులో ఉచిత మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. పట్టణంలో పలు చోట్ల మట్టి ప్రతిమల పంపిణీ జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బూర్గంపాడు, సెప్టెంబరు 6: వేగంగా వెళ్తున్న టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో దిచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదం శ్రీరాంపురం వద్ద చోటుచేసుకుంది. బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక పంచాయతీలో గల శ్రీరాంపురం మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ద్విచక్ర వాహన నెంబర్, మృతుడు జేబులో ఉన్న కార్డులు ఆధారంగా దుమ్ముగూడెం ఎంపీడీవో కార్యలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పెనకట్ల రాజారమేష్(45)గా గుర్తించారు. భద్రాచలంలో నివాసం ఉంటున్న రమేష్ వ్యక్తిగత పని మీద పాల్వంచ వెళ్లి తిరిగి భద్రాచలం వెళుతున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడికి భార్య సునీత, కుమార్తె విశ్వతేజిని ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పులుసు బొంత' వివరాలు సేకరించాలి

కరకగూడెం, సెప్టెంబరు 6: మండలంలోని సమత్ మోతే పంచాయితీ రంగాపురం సరిహద్దులో నిర్మించనున్న పులుసు బొంత ప్రాజెక్టు ప్రాంత అటవీ భూముల పూర్తి వివరాలను సేకరించాలని జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పులుసు బొంత ప్రాజెక్టు నిర్మాణం చేసే ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు కేనాల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అటవి భూములను ఎస్టిమేషన్ వేస్తే జిల్లాలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణం కోసం కోల్పోతున్న అటవీ భూములకుగాను అక్కడ ఇస్తున్నట్లు తెలిపారు. త్వరగతిన పూర్తి చేసి నివేదిక అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ళ బయ్యారం రేంజర్ ఉపేందర్, సెక్షన్ ఆఫీసర్ గోవింద్, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.